# ప్రాయశ్చిత్తము

శ్రీ ఈదర లక్ష్మీనారాయణ.

సీతమ్మ దేవాలయమంటే వూళ్లో చాలా పేరు, ప్రసిద్ధి. పిల్లలు మొదలు పెద్దలవరకు ఆ దేవాలయమందు ఒక విధమైన భక్తి శ్రద్ధలు కలిగివుంటారు. సీతమ్మ ప్రతిసంవత్సరమూ జోరుగా ఉత్సవము చేయించి వడపప్పు బెల్లాలు పంచి పెట్టిస్తుండేది.

వసంతమునాడు ఊళ్లో పిల్లలతో సహా పిలవకుండానే 'దేవుడి పెండ్లికందరు పెద్దలన్నట్టుగా పోయి చెంబుడు వసంతం నెత్తిన గ్రుమ్మరించుకొని వస్తూ వుండేవారు. సీతమ్మ మాటకారి. మహా భక్తి శ్రద్ధలు గలది. సంవత్సరానికి కనీసము 5,6 వందలైనా ఖర్చుపెట్టి వుత్సవాలు వూరేగింపులు చేయిస్తుండేది.

సీతమ్మ కాలంజేసినప్పటినుండి దేవుడికి ఆ విధంగానే అభిషేకాలు, వుత్సవాలు చేయిస్తున్నాడు ఆమె కొడుకు రామన్న. రామన్న కూడా తల్లివంటి భక్తి పరాయణుడే. నిత్యము ప్రొద్దున్నే స్నానముచేసి తెల్లని పంగనామాలమధ్య ఎర్రని కుంకుమబొట్టుతో తయారయ్యేవాడు. మాలమాదిగలంటే సామాన్యంగా పదిగజాల దూరంగా తొలిగిపోతుండేవాడు. ప్రొద్దున్నే వెధవముండ ఎదురయినా పర్వాలేదు గాని మాలాడు ఎదురయ్యాడా గొణుగుకుంటూ పోయి ఆపాదమస్తకము నాలుగు కడవల నీటితో తడిపేవాడు.

మహా బ్రాహ్మణ భక్తి కలవాడు. బ్రాహ్మణుడు కనపడితే చాలు ఆయన రెండుచేతులు అకస్మాత్తుగా కలుసుకుపోయేవి. పాపం దురదృష్టంవల్ల సంతానంలేదు. సంతానం కోసం చేసిన నోములు వ్రతాలు. జపాలు, తపాలు యిన్నిన్ని కావు. చుట్టు ప్రక్కల ఆయనవల్ల దానదక్షిణ పొందని విప్రవరుడు లేడు.

రామన్నకు ఆధ్యాత్మిక విషయాలంటే మహా ప్రీతి. ఆ వూళ్లోనే వెంకన్న అనే ఆయన వకాయన వుండేవాడు. ఆయన ఆధ్యాత్మిక శక్తిగలదని రామన్నకు గట్టి నమ్మకం. అందుకని ఎప్పుడూ ఆయన దగ్గరకుపోయి కూర్చుండేవాడు. ఆయన విసుగు విరామమూ లేకుండా ఏదో హస్కుకొడుతూ వుండేవాడు. వెంకన్న గాంధి భక్తుడు. ఆయనమీద గాంధిగారి మంత్రం బాగా పనిజేసింది. జైలుకు పంపింది. ఖద్దరు ధరింపజేసింది వెంకన్న సాంగత్యంవల్ల రామన్నలో వక మార్పు కలిగింది. ఆరునెల్లు సావాసముజేస్తే వాడువీడు, వీడువాడు అయిపోతారట ఖద్దరంటే మహా మోటుగాను మొరటుగాను వుండేది రామన్నకు మొదట. ఖద్దరు కట్టినవాళ్ళను కేవలం పిచ్చాళ్ల క్రింద కట్టేశేవాడు. కాని యిప్పుడు తనవరకు ఖద్దరు కట్టగల సామర్ధ్యము సంపాయించుకున్నాడు వెంకన్న సావాసమువల్ల వెంకన్న ఎల్లప్పుడూ గాంధీ సిద్ధాంతాలను సరించి బోధిస్తూ వుండేవాడు. వుండ వుండగా గాంధీ సిద్ధాంతాలు బుర్ర కెక్క సాగాయి. రామన్న పత్రిక కూడా ఒకటి తెప్పించి చూడసాగాడు.

* * *

గాంధీగారి వుద్యమములో మార్పు గలిగింది. హరిజనాందోళన బయలుదేర దీశాడు. హరిజనాందోళన జోరుగా సాగ మొదలిడింది. గాంధీగారు ఆంధ్రదేశములో సంచారము చేస్తున్నారు. వెంకన్న హరిజనులు దేవాలయ ప్రవేశాలను గురించి బాగా నచ్చజెప్పాడు రామన్నకు.

మహా కష్టంమీద ఈమిషతోనైనా గాంధిగారిని తన యింటికి పిలిపించుకొనవచ్చునని సరేనన్నాడు. వెంకన్న పత్రికకు వ్రాసాడు. గాంధీగారి ప్రోగ్రామ్‌లో రామన్న రామాలయం కూడా పడ్డది. పాపం రామన్నకు మనస్సులో పీకులాటగా వుంది పెళ్ళాం ఏం అడ్డుపుల్ల వేస్తుందోనని. ఎట్లాగో ఊ సంగతి సుబ్బమ్మ కూడా చెవిని వేసుకుంది. సుబ్బమ్మ మహా గడుగ్గాయమనిషి. పట్టు పట్టిందంటే మొసలిపట్టే. ఈ సంగతి తెలిసి కంటనీరు బెట్టి మూతి బిగ తీసుకు కూర్చుంది. 'మాలమాదిగ ముండాకొడుకులు నా గుళ్ళోకి రావటానికి వీల్లేద'న్నది. ఇది విని రామన్న గాంధీగారి మీద వక అరగంట లెక్చరు కొట్టాడు. ఊ.హుం పెళ్లాం బుర్ర కెక్కనే లేదు. పైగా మీరే గనక మాదిగ ముండాకొడుకులను గుళ్ళోకి తీసికొస్తే బావిలో పడతానంది నాముత్తవిచ్చిన డబ్బు నాది, నాకివ్వమంది. నాడబ్బుతో నాతో మీకేమి పనిలేదంది. రామన్నకూడా తమాయంచి వూరుకోకుండా కస్సాయి బస్సాయి మంటూ కాలు దువ్వాడు. నువ్వంటే ఎంత పోతే వింత అన్నాడు. కాని పప్పుడుక లేదు.

ఇది చూచేటప్పటికి వ్యవహారం పెడతిరిగిందనుకున్నాడు. వెంకన్న దగ్గరకు పోయి లాభం లేదండీ అని చప్పరించాడు. పత్రికలో ప్రకటించిన మీదట యిప్పుడు కాదంటం బాగుండ లేదండీ అన్నాడు. గృహ కల్లోలం కూడా చెప్పాడు రామన్న. కాని వెంకన్న కట్టిన కాలే బాపతు కాదు. పత్రికలో ప్రకటించినందుకుగాను వుపవాసము జేసి ప్రాయశ్చిత్తము జేసికుంటానన్నాడు. ఆ పూటే వుపవాస దీక్షపూనాడు. వూరంతా గప్‌మంది. సాయంత్రం అయ్యేటప్పటికి వెంకన్నకు వాంతులు పుట్టినవి. నీళ్లు, పసర తెగకక్కాడు. మరుసటినాడు సొమ్మసిల్లి వెంకన్న స్థితిజూచి వూళ్లో పదిమంది పోయి రామన్న భార్య సుబ్బమ్మను బ్రతిమాల సాగారు. ససేమిరా అంది. ఊ వుపవాసంలో ప్రాణాలు కడబట్టేటట్లయితే ఆ వుసురంతా మీకు తగులుతుందని చెప్పారు. అప్పటికి నీళ్లు నములుతూ మెత్తబడ్డది.

వెంకన్న వుపవాసదీక్ష విరమించాడు.

ఇక రెయ్యింబవళ్లు విరగబడి ప్రయత్నాలు చేయసాగారు. వూరిబయట వరకూ తోరణాలు కట్టారు రంగుకాగితాలైతే గాంధీగారికి కొవని. సుస్వాగతమని హిందిలో వ్రాశారు. నడి బజారులో చాలా ఆవరణవుంది. ఆవరణలో వేదిక-గాంధీగారు కూర్చుంటానికి కట్టారు. స్త్రీలకు ప్రత్యేక సౌకర్యాలు. ఇవ్వాళ సాయంత్రం వస్తారనంగా వుదయం నుండీ జనం మూగసాగారు. భగవంతుడి దయవల్ల చల్లబడి వుంది. వూళ్ళోని యువకులందరూ వాలంటీర్లుగా తయారయ్యారు. యువతులందరూ మూగిపోయారు.

గాంధీగారి వేదికచుట్టూ దగ్గరగా మరియొక అవరణ కట్టారు. ఆవరణలో కొంచెం పెద్దపెద్ద తలకాయలకు మాత్రమే ప్రవేశంవుంది. నాలుగు గంటలకల్లా భూమి జనాన్ని ఈనుతుందో అన్నట్లుగా వుంది. ప్రతివాడు నేను గాంధీగారికి దగ్గరగా కూర్చోవాలంటే నేనని నెట్టుకో సాగారు. ఎవరో అయిదారుసార్లు వట్టివట్టి అల్లరి కూడా చేసారు. కారు హారన్ వినగానే జనం వాలంటీర్లను నెట్టిపారవెయ్యటం మొదలెట్టారు. చాలామంది డిసిప్లిన్‌ను గురించి వుపన్యాసాలు సాగించారు. ఇంతలో నవ్వుకుంటూ వడబడ్డ ముఖంతో రాత్రి ఎనిమిదింటికి వేదిక మీదికి వేంచేశారు గాంధీగారు. స్వాగత పత్రాలు బహుమానాలు నూలుదండలూ పూలందలూ గాంధీగారి కందించసాగారు. సభ అయ్యేటప్పటికి గాంధీగారికి బడలిక లేసింది. రామాలయం వరకు నే రాలేనన్నారు. రామన్న మనస్సు కలుక్కుమంది. గాంధీగారిని రామన్న యింటికిపంపి వెంకన్న అప్పల దాసుని వెంటబెట్టుకొని రామాలయానికి వెళ్ళాడు. గుమ్మం దాకా వచ్చిన తర్వాత ముందుకు సాగడానికి కాళ్ళాడలేదు దాసుకు. గడగడ వణక సాగాడు. వెంకన్న గమ్మనమని ముందుకు లాగాడు చెయ్యి చేతబట్టి. దాసు లోపలికి పోగానే కళ్లుమూసికొని ఈశ్వర ధ్యానం చేసాడు. మాలాళ్లు గుళ్లోకి వస్తారని వినగానే అర్చకుడు ఒక సలాం జేసాడు. దేవుడు దాసుమీద నిప్పులు గ్రక్కుతున్నట్టు కనిపించాడు. భయంవల్ల వణకు పుట్టింది. గంట కొట్టి బయట పడ్డాడు; పులి నోట్లోనుండి బయట పడ్డట్టుంది దాసుకు. బయటకొచ్చిన మీదట వూపిరాడింది.

గాంధీగారిని సాగనంపే టప్పటికి తల ప్రాణం తోకకు వచ్చింది. రామన్నకు రాత్రంతా నిద్రలేదు. అదియిది అందించటము తోటే సరిపోయింది. సరిపోయేటప్పటికి మహా భారం జేసింది. వేడిజేసి దగ్గు పడిశము పట్టింది.

పదిరోజులు మహా భారం చేసింది. తర్వాత పడిసెము పోయింది దగ్గు ఎప్పటివలనే వుంది. అప్పుడప్పుడు జ్వరం కూడా రాసాగింది హరిజనులు గుళ్లోకి రావడమంటే యిష్టం లేనివాళ్లందరు యింకేముంది రామన్నమీద రాములవారికి కోపం వచ్చిందని సాగించారు. నెమ్మది నెమ్మదిగా రామన్నకు కూడా అధైర్యము కలిగింది. మాలవాళ్లని గుళ్లోకి రానివ్వటం బుద్ధితక్కువైనదనుకున్నాడు. చాలామంది రామన్న అధైర్యాన్ని బలపరచారు. శుద్ధిజేయించి ప్రాయశ్చిత్తం చేసుకోమన్నారు. అందుకు కూడా సంసిద్ధమయాడు.

మళ్లా అర్చకులను బ్రతిమాలుకున్నాడు. వాళ్ళొచ్చి గుడి శుభ్ర పరచారు, పుజారి, రామన్నచేత కటికి వుపవాసం జేయించాడు. అప్పుడతనిని గుళ్ళో ప్రవేశపెట్టాడు. రామన్న మనసులో భగవధ్యానం చేయసాగాడు......

దేవా! తెలిసో తెలియకో బుద్ది తక్కువైంది. యికనైనా మన్నించాలి. ఇక నుండి మాలాళ్లని గుమ్మం త్రొక్కనిస్తే ఒట్టని చెంపలేసుకొని బయటకొచ్చాడు. అర్చకుడు నాలుగురోజులు వుపవాసముజేసి పండ్లరసముతో కాలము గడపమన్నాడు, అయిదోనాడు అంతులేకుండా పోయింది దగ్గు జ్వరము.—

